ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 323 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 27 ఫిబ్రవరి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## ప్రియాంక గాంధీ తెలంగాణ పర్యటన రద్దు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ తెలంగాణ పర్యటన రద్దు అయింది. నేడు చేవెళ్లలో ప్రియాంక గాంధీ సమక్షంలో తెలంగాణ ప్రభుత్వం రెండు స్కీంలను ప్రారంభించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. రూ.500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ స్కీమ్‌లను ప్రియాంక గాంధీ చేతులమీదగా ప్రారంభించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రియాంక గాంధీ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేసుకుంది. అయితే.. అనివార్య కారణాల వల్ల ప్రియాంక గాంధీ పర్యటన రద్దు అయింది.




## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై సర్కార్ తీపికబురు

### మార్చి 31లోగా క్రమబద్ధీకరణకు అవకాశం
### 20 లక్షల మందికి లబ్ధి
### రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం): లేఅవుట్ క్రమబద్ధీకరణ కోసం తీసుకొచ్చిన పథకం 2020- ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్చి 31లోగా దరఖాస్తులకు లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములను తప్ప ఇతర లే అవుట్‌లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో.. 20 లక్షల మంది దిగువ, మధ్య తరగతి వర్గాలకు చెందిన దరఖాస్తుదారులకు మేలు కలగనుంది. అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణకు తీసుకొచ్చిందే ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం). ప్రభుత్వ విధివిధానాలు పాటించకుండా నిర్మించిన లే అవుట్లు, అక్రమ స్థలాల్లో నిర్మించిన లే అవుట్లను అన్ అప్రూవ్‌డ లే అవుట్లు అంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఇలాంటి స్థలాలను తప్పకుండా క్రమబద్ధీకరించుకోవాలి. ఇందుకోసం 2020లో ఎల్ఆర్ఎస్-2020 (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్-2020) పేరుతో మార్గదర్శకాలను విడుదల చేసింది. అధికారిక లేఅవుట్‌లో పది శాతం స్థలాన్ని ఖాళీగా వదలాల్సి ఉంటుంది. కానీ.. అనధికారిక లేఅవుట్లలో ఖాళీ స్థలం ఉండదు. దీంతో జనావాసాల్లో సౌకర్యాలు సరిగా ఉండవని, అలాంటి లేఅవుట్లలోని ఇళ్ల స్థలాల నుంచి 0.14శాతం ఓపెన్ ల్యాండ్ ఛార్జీలను వసూలు చేస్తారు. ఆ డబ్బుతో కొంత ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేసి.. అనధికార లేఅవుట్‌లోని కాలనీకి కేటాయించాలన్నది ముఖ్యోద్దేశం. కానీ.. జీహెచ్ఎంసీ ప్రణాళిక విభాగం ఎల్ఆర్ఎస్‌ను ఆదాయ వనరుగానే చూస్తోంది. ఇప్పటి వరకు ఎల్ఆర్ఎస్ పథకం కింద రూ.100కోట్లకుపైగా -మిగతా 2వ పేజీలో

## పన్ను వసూళ్లలో నిర్దేశిత లక్ష్యం సాధించాలి

### వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, రిజిస్ట్రేషన్లు, రవాణా, గనులు, భూగర్భ వనరుల శాఖ పన్ను వసూళ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష




హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం): పన్ను వసూళ్లలో నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అన్ని శాఖలు సాధించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, రిజిస్ట్రేషన్లు, రవాణా, గనులు, భూగర్భ వనరుల శాఖ పన్ను వసూళ్లపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. వాణిజ్య పన్నుల శాఖలో పన్ను లక్ష్యానికి, రాబడికి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఎందుకు ఉందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది వరకు జీఎస్టీ పరిహారం కింద రూ.4 వేల కోట్లకుపైగా చెల్లించేదని, దాని గడువు ముగియడంతో ఆ నిధులు రాకపోవడంతో రాబడిలో వ్యత్యాసం కనిపిస్తోందని అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మద్యం సరఫరా, విక్రయాలకు సంబంధించిన లెక్కలు తేడాలు ఉంటున్నాయని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రతి డిస్టలరీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సరఫరా వాహనాలకు జీపీఎస్ అమర్చి వాటిని ట్రాకింగ్ చేయాలని, బాటిల్ ట్రాకింగ్ సిస్టం ఉండాలని, మద్యం సరఫరా వాహనాలు వే బిల్లులు కచ్చితంగా ఉండాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాన్డ్యూటీ పెయిడ్ లిక్కర్తో పాటు గతంలో నమోదు చేసిన పలు కేసుల పురోగతిపై నివేదిక సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్ష సందర్భంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అదే సమయంలో తమ శాఖలోనూ అదే పరిస్థితి నెలకొందని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ..మిగతా 2లో

## సింగరేణి ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా



2లో..




## రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ పార్టీ

### 10 మంది వీఐపీలపై కేసు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం): రాడిసన్ బ్లూ హోటల్ డ్రగ్స్ కేసులో పురోగతి చోటు చేసుకుంది. డ్రగ్స్ పార్టీలో పాలు పంచుకున్న పది మంది వీఐపీలపై కేసు నమోదు అయ్యింది. ఈ మేరకు ఎఫ్ఐఆర్‌లో కీలక విషయాలు వెలుగు చూశాయి. ఇద్దరు అమ్మాయిలతో పాటు మొత్తం 9 మందిపై కేసులు నమోదు అయినట్లు తెలుస్తోంది. వ్యాపారవేత్తలు గజ్జల వివేకానంద్, అబ్బాస్, కేదార్, సందీప్‌లు.. సెలబ్రిటీ శ్వేతతో పాటు లిశి, నీల్‌పైనా కేసు నమోదు అయినట్లు తెలుస్తోంది. అలాగే.. డ్రగ్స్ సేవించిన నిర్భయతో పాటు ..మిగతా 2లో

## నేడే రాజ్యసభ ఎన్నికలు

### తెలుగు రాష్ట్రాల్లో సహా మొత్తం 41 స్థానాలు ఏకగ్రీవం..15 సీట్లకే ఎన్నికలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం): రాజ్యసభ ఎన్నికలకు నేడు జరగనున్నాయి. మొత్తం దేశంలోని 15 రాష్ట్రాల్లోని 56 స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా.. అందులో 12 రాష్ట్రాల్లోని 41 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఇక మిగిలిన 3 రాష్ట్రాల్లోని 15 స్థానాల్లో మాత్రమే అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల విత్ డ్రా చివరి తేదీ నాటికి 41 మంది ఏకగ్రీవం అయినట్లు రాజ్యసభ సెక్రటేరియట్ ప్రకటించింది. ఈ 41 మంది ఏకగ్రీవం అయిన వారిలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా ఉన్నారు. వీరే కాకుండా ఇటీవలె కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, ఎల్ మురుగన్ పెద్దల సభకు ఏకగ్రీవం అయ్యారు. ఇక మొత్తం 41 మంది ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థుల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నుంచి అత్యధికంగా 20 మంది ఉన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి ఆరుగురు, తృణముల్ కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు, వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి ముగ్గురు, ఆర్జేడీ నుంచి ఇద్దరు, బీజేడీ నుంచి ఇద్దరు, ఎన్సీపీ, -మిగతా 2వ పేజీలో



## రాష్ట్రానికి మోదీ, షా, నడ్డా

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం): తెలంగాణలో బీజేపీ అగ్రనేతలు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సహా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వరుస ఎన్నికల పర్యటనలతో హోరెత్తించనున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి కనీసంగా పది ఎంపీ సీట్లు గెలుపొందాలన్న లక్ష్యం నేపథ్యంలో.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రచారాన్ని ప్రారంభించక ముందే బీజేపీ ఉధృత ప్రచారం చేపట్టాలని భావిస్తోంది. ఆ మేరకు ఆ పార్టీల అభ్యర్థుల ప్రకటనకు ముందే ఈ నెలాఖరులోగా బీజేపీ అభ్యర్థుల తొలిజాబితాను ప్రకటించి ఎన్నికల ప్రచారపర్వంలోకి దూకాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగానే ఆదిలాబాద్, సంగారెడ్డిల్లో ఏర్పాటు చేసిన సభలకు ప్రధాని మోదీ విచ్చేసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడతారని తెలుస్తోంది. ఆయా సభలకు ముందు రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంకోత్సవాలు, శంకుస్థాపనలను మోదీ చేతుల మీదుగా చేపట్టాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. గత పదేళ్ల పాలనలో -మిగతా 2వ పేజీలో

## 554 రైల్వే స్టేషన్లలో పునరాభివృద్ధి పనులు

### రూ.41 వేల కోట్ల విలువైన రైలు ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం): భారత్ ఇప్పుడు పెద్ద కలల కంటోందని.. కలలను నెరవేర్చడానికి పగలు, రాత్రి పని చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం సుమారు రూ.41,000 కోట్ల విలువైన 2,000 కంటే ఎక్కువ రైలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు. తమ ప్రభుత్వం మూడో టర్మ్ జూన్ నుంచి ప్రారంభమవుతుందని ప్రధాని మోదీ తమ వీడియో ప్రసంగంలో ధీమా వ్యక్తం చేశారు. వందేభారత్ రైళ్ల ప్రారంభం, పరిశుభ్రత, ట్రాక్‌ల విద్యుద్దీకరణ వంటి వాటితో సహా రైల్వేలలో పరివర్తనను గురించి చెప్పిన ఆయన..గత 10 ఏళ్లలో నూతన భారతదేశాన్ని నిర్మించడాన్ని ప్రజలు చూశారన్నారు. గత ప్రభుత్వాలపై ..మిగతా 2లో



## సింగరేణి ఉద్యోగులకు
# రూ.కోటి ప్రమాద బీమా

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం):తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కీలకపాత్ర పోషించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో బీజేపీతో.. బీఆర్ఎస్ ప్రభుత్వం కుమ్మక్కు అయ్యి సింగరేణి సంస్థ భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేశారని మండిపడ్డారు. తెలంగాణ సచివాలయంలో సింగరేణి ఉద్యోగులకు రూ. కోటి ప్రమాద బీమా పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'నేటికి రాష్ట్ర ప్రభుత్వ అప్పు రూ. 7 లక్షల కోట్లు. ప్రతీ సంవత్సరం రూ. 70 వేల కోట్ల అప్పు కట్టాల్సిన ఆర్థిక సంక్షోభం కేసీఆర్ తీసుకొచ్చారు. పదేళ్ల లో అన్ని వ్యవస్థ లను విధ్వంసం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో డిసెంబర్ నుంచి అక్టోబర్ వరకు రైతు బంధు వేశారు. మేము మార్చి 31 లోపు పూర్తి చేస్తామని చెప్పాం. కేటీఆర్, హరీష్‌రావులు అబద్దాలతోనే ఇంకా మోసం చేస్తున్నారు. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, కవిత తప్ప ఇంకోకరు మాట్లాడడం లేదు. రోజు వారి ఆదాయాన్ని అంచనా వేసి చెల్లింపులు చేస్తున్నాం. ఉద్యోగ నియామకాలు చేపడుతే.. నియామకపత్రాలు ఎందుకు ఇవ్వలేదు. 70 రోజుల్లో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. మార్చి 6 న మరో 6 వేల ఉద్యోగాలు ఇవ్వబోతున్నాం. అన్నారం, మేడిగడ్డ బ్యారేజ్‌లు కుంగిపోయాక నీళ్లు ఎత్తిపోయడం సాధ్యమయ్యేపనేనా. కృష్ణా నది జలాలు ఎవరు కేంద్రానికి అప్పగించారో ప్రజలకు తెలుసు. బీఆర్ఎస్, బీజేపీ పదేళ్ల లో ఇచ్చిన హామీలు, మా గ్యారెంటీలపై అసెంబ్లీ సమావేశాలలో చర్చించేందుకు సిద్ధమా. బీఆర్ఎస్ నేతల మాటలనే కిషన్ రెడ్డి మాట్లాడుతున్నారు. రైతుల ఆదాయం రెట్టింపు, సంవంత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల సంగతి ఏమైంది. రాష్ట్ర సమస్యలపై ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను కలిశాం. రాష్ట్ర బీజేపీ నేతలు ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎందుకు కలవడం లేదు. పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా ఢిల్లీలో కాల్చి చంపారు. హైదరాబాద్ వరదలు వస్తే కేంద్రం సహాయం ఎందుకు చేయలేదు. నేడు సాయంత్రం 500లకు గ్యాస్, పేదలకు 200 యూనిట్ల ఉచిత కరెంటును ప్రారంభించబోతున్నాం. బీజేపీ, బీఆర్ఎస్‌లకు రాజకీయ స్వార్థం ఉంది . .రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ ,రాష్ట్రాన్ని కాపాడేది కాంగ్రెస్. మమ్మల్ని ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదు. వడ్డీ కట్టడానికి అప్పు తేవాల్సిన పరిస్థితి ఉంది. నిరుద్యోగులకు విశ్వాసం కల్పించే ప్రయత్నం జరుగుతుంది. ప్రతీ నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. పోటీ పరిక్షలకు సిద్ధం అయ్యే వారికి డిజిటల్ క్లాసులు నిర్వహిస్తాం. వైట్ రేషన్ కార్డు ప్రమానికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో హైవేలకు, గుట్టలకు రైతు బంధు ఇచ్చారు. కేటీఆర్ ఔట్ సోర్సింగ్ పర్సన్'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై
# సర్కార్ తీపికబురు

(మొదటి పేజీ తరువాయి)

రుసుము వసూలు చేయగా, అందులో ఒక్క రూపాయిని కూడా ఉద్దేశించిన లక్ష్యం కోసం వెచ్చించలేదు. అయితే.. రాష్ట్రంలో లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద దరఖాస్తు చేసుకున్న ఎంతోమంది గత మూడున్నరేళ్లుగా ఎదురుచూపులు చూస్తున్నారు. నగర, పురపాలికలు; పంచాయతీల పరిధిలో అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు 2020లో గత ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించడంతో 25 లక్షలకు పైగా దరఖాస్తులు అందాయి. ఈ మేరకు క్రమబద్ధీకరణను చేపట్టే క్రమంలో న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు దాఖలు కావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే 20లక్షల మందికి పైగా లబ్ధి చేకూర్చే.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2020లో స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించిన లేఔట్‌లను క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. మార్చి 31లోపు దరఖాస్తుదారులకు ఈ అవకాశం కల్పించనుంది. సోమవారం ఆదాయ సమీకరణ, వనరులపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అనధికారిక అంచనాల ప్రకారం అందిన దరఖాస్తుల్లో అర్హమైన వాటిని క్రమబద్ధీకరించడం ద్వారా సుమారు రూ.10 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

## పన్ను వసూళ్లలో
# నిర్దేశిత లక్ష్యం సాధించాలి

మొదటి పేజీ తరువాయి...

సీఎం రేవంత్ రెడ్డి ఆదాయాన్ని తెచ్చే శాఖలకు సొంత భవనాలు లేకపోవడం సరికాదని, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్తో పాటు జిల్లా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్తో పాటు నగరంలో పలు ప్రాంతాల్లో రహదారులపై కంకర కుప్పలుగా పోసి విక్రయిస్తున్నారని, అలా కాకుండా నగరంలో వివిధ ప్రదేశాల్లో ప్రభుత్వ స్థలాలను అందుకు వినియోగించాలని పేర్కొన్నారు. ఇసుక విక్రయాలపై సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వే బిల్లులతో పాటు ఇసుక సరఫరా వాహనాలకు ట్రాకింగ్ ఉండాలని, అక్రమ రవాణాకు అవకాశం ఇవ్వవద్దని ముఖ్యమంత్రి సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినందుకుగానూ పలు గనులపై గతంలో జరిమానాలు విధించారని, కేసులు నమోదు చేశారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. విధించిన జరిమానాలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. గతంలో జరిమానాలు విధించి తర్వాత వాటిని తగ్గించారని, అందుకు కారణాలు ఏమిటో తెలియజేయాలని, దానిపై నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. టీఎస్ ఎండీసీతో పాటు గనుల శాఖలో పలువురు అధికారులు ఒకే పోస్టులో ఏళ్ల తరబడి తిష్ట వేశారని, కొందరిపై ఆరోపణలున్నాయని, వారిని వెంటనే బదిలీ చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేడే రాజ్యసభ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి...

శివసేన, బీఆర్ఎస్, జేడీయూ పార్టీల నుంచి ఒక్కక్క అభ్యర్థి రాజ్యసభకు పోటీ లేకుండానే ఎన్నికయ్యారు. ఇక మిగిలిన 15 స్థానాలకు మంగళవారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ 15 స్థానాలు 3 రాష్ట్రాల్లో ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించిన రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇక తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 6 ఖాళీలు ఏర్పడనుండగా.. రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల విత్ డ్రా సమయానికి పోటీలో ఒక్కొక్క అభ్యర్థి మాత్రమే బరిలో నిలవగా.. వారినే విజేతలుగా అధికారులు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు, తెలంగాణలో ముగ్గురు ఏకగ్రీవంగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ స్థానాల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 2 స్థానాలు, బీఆర్ఎస్ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున సీనియర్ నాయకురాలు రేణుకా చౌదరీ, యువ నాయకుడు అనిల్ కుమార్ యాదవ్‌లు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక బీఆర్ఎస్ పార్టీ తరఫున మరోసారి వద్దిరాజు రవిచంద్రకు అవకాశం దక్కింది. అటు ఆంధ్రప్రదేశ్‌లోని 3 రాజ్యసభ స్థానాలను అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేసింది. వైసీపీ తరఫున రాజ్యసభ సభ్యులుగా గొల్ల బాబూరావు, వైవి సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డిలు నామినేషన్లు దాఖలు చేయగా.. వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరోవైపు.. టీడీపీ ఆవిర్భావం తర్వాత తొలిసారి రాజ్యసభలో ఆ పార్టీ ప్రాతినిధ్యం కోల్పోయింది. రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు విముఖత చూపడంతో ఆ పార్టీ తరఫున ఎవరు నామినేషన్ వేయలేదు. ప్రస్తుతం అసెంబ్లీలో టీడీపీకి ఉన్న బలంతో రాజ్యసభ అభ్యర్థిని గెలిపించుకునే పరిస్థితి లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

# 554 రైల్వే స్టేషన్లలో పునరాభివృద్ధి పనులు

మొదటి పేజీ తరువాయి...

విరుచుకుపడిన ప్రధాని మోదీ .. తమ ప్రభుత్వం ప్రజా ధనాన్ని దోచుకోవడాన్ని ఆపివేసిందని, సంపాదించిన ప్రతి పైసా రైల్వే సేవలను విస్తరించడంలో ఉపయోగించారని అన్నారు. భారతీయ రైల్వేలు ఒకప్పుడు రాజకీయాల బాధితురాలిగా ఉండేవని, అయితే ఇప్పుడు ప్రయాణ సౌలభ్యానికి ఇది ప్రధాన ఆధారమని, ఇది పెద్ద ఉపాధి వనరుగా కూడా మారిందని ఆయన అన్నారు. స్కామ్‌ల కారణంగా ఆదాయం లీక్ అయితే, దేశం అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కారణంగా బడ్జెట్‌లో పెరుగుదల భూమిపై ప్రభావం చూపదని ప్రధాని మోడీ ప్రజలను హెచ్చరించారు.స్థానిక సంస్కృతి, కళాకారులను ప్రోత్సహించడానికి పునరుద్ధరించబడిన రైల్వే స్టేషన్లు ఉపయోగించబడు తున్నాయని ఆయన తెలిపారు. రైల్వేల ఆర్థిక నష్టాలు అంతకుముందు సాధారణ పల్లవిగా ఉండేవని, అయితే జాతీయ రవాణా సంస్థ ఇప్పుడు పరివర్తనకు పెద్ద శక్తిగా మారిందని ప్రధాని అన్నారు.యువతకు వారి కలలే నా సంకల్పమని నేను చెప్పాలనుకుంటున్నాను, మీ కలలు, కృషి, నా సంకల్పం విక్షిత్ భారత్ యొక్క హామీ అని ఆయన అన్నారు.

# రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ పార్టీ

మొదటి పేజీ తరువాయి...

రఘు చరణ్‌పైనా పోలీసులు కేసు నమోదు చేశారు. అబ్బాస్ దగ్గర వివేకానంద డ్రగ్స్ కొనుగోలు చేసి.. తన స్నేహితులతో పార్టీ చేసుకున్నట్లు తేలింది. వీళ్లంతా కొకైన్ పేపర్‌లో చుట్టి డ్రగ్స్ తీసుకున్నట్లు గుర్తించినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొని ఉంది. అంతేకాదు.. ఈ డ్రగ్స్ పార్టీలో మరికొంత మంది ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు చెబుతున్నారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి.. "రాడిసన్ బ్ల్యూ హోటల్ పై స్పెషల్ ఆపరేషన్ టీం పోలీసులతో దాడి చేశాం. అక్కడ డ్రగ్స్ పార్టీ జరుగుతున్నట్లు సమాచారం రావడం తో సెర్చ్ చేశాం. అప్పటికే హోటల్ నుండి నిందితులు పరారయ్యారు . అప్పటికే అందించిన సమాచారంతో.. వివేకానంద ఇంటికి వెళ్ళాం. వివేకానంద మంజీర గ్రూప్‌కి డైరెక్టర్‌గా ఉన్నాడు. ఇంటికి వెళ్లిన సమయం లో పోలీసులకు విచారణకు సహకరించకుండా కొంత ఇబ్బంది పెట్టారు. వివేకానందను అదుపులోకి తీసుకొని డ్రగ్స్ టెస్ట్ చేశాం. వివేకా నంద తో పాటు నిర్భయ్ , కేదార్‌లకు పాజిటివ్ వచ్చింది. వివేక్ కు యూరిన్ టెస్ట్ చేయించాము, కొకైన్ తీసుకున్నట్లు రిపోర్ట్ వచ్చింది. మొత్తం ఈ పార్టీ లో 10 మంది ఉన్నట్లు గుర్తించాం. రాడిసన్ హోటల్ లో గతంలో పార్టీలు జరిగాయి. సయ్యద్ అబ్బాస్ అనే వ్యక్తి డ్రగ్స్ సప్లై చేస్తున్నట్లు గుర్తించాం. వివేకా నంద, నిర్భయ్ , కేదార్ పై 121b 27, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. డ్రగ్స్ ద్వారా సంపాదించిన ఆస్తులు ను కూడా మేము అటాచ్ చేస్తున్నాం అని సీపీ వెల్లడించారు.

# రాష్ట్రానికి మోదీ, షా, నడ్డా

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలో తమ ప్రభుత్వం సాధించిన ప్రగతితో పాటు జాతీయ, రాష్ట్రస్థాయిల్లో కాంగ్రెస్ పార్టీ తీరును, రాష్ట్రంలో గత తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ సర్కారు అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై మోదీ సునిశిత విమర్శలు చేస్తారని రాష్ట్ర పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 29న ఢిల్లీలో జరగనున్న బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో రాష్ట్రంలోని 17 సీట్లలో మెజారిటీ (అంటే 12 స్థానాలకు) అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఈ 29న ఇద్దరు లేదా ముగ్గురు సిట్టింగ్ ఎంపీలు, ఐదారుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. వీరి చేరికను బట్టి ఎవరు గట్టి అభ్యర్థులు అవుతారో వారి బలాబలాల ప్రాతిపదికన పేర్లను ఖరారు చేయనున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, మరింత మెరుగైన అభ్యర్థుల కోసం అన్వేషణలో భాగంగా... జహీరాబాద్, పెద్దపల్లి, నల్లగొండ, వరంగల్, ఖమ్మం సీట్లకు క్యాండిడేట్ల ఎంపికను పెండింగ్‌లో పెట్టినట్టుగా పార్టీ నాయకులు చెబుతున్నారు. వచ్చే నెల 4న హైదరాబాద్‌లో సభ ద్వారా లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో అమిత్‌షా పాల్గొంటారని తెలుస్తోంది. ముందుగా రాష్ట్ర పర్యటన ఖరారైతే అదే రోజున అమిత్ షా బదులు మోదీ సభ ఉండొచ్చునని సమాచారం. ఈ సభ కోసం గచ్చిబౌలి, సరూర్‌నగర్ స్టేడియాలను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలు కవర్ చేసేలా (ఐదు వేర్వేరు ప్రాంతాల్లో) చేపట్టిన విజయసంకల్పయాత్రల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో మార్చి 2న అమిత్‌షా సభతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని తొలుత భావించారు. ఐతే 2వ తేదీకి బదులు 4న రాష్ట్రానికి వచ్చేందుకు అమిత్‌షా సమయం కేటాయించడంతో అదేరోజున సభను నిర్వహించాలని నిర్ణయించినట్టు పార్టీవర్గాల సమాచారం.

# 9.49 కోట్లతో గద్వాల రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు


అమృతోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి


విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపీ రాములు


రైల్వే పనులకు శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ రాములు, ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## అమృత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం)జోగులాంబ గద్వాల రైల్వే స్టేషన్ అమృత్ భారత్ స్టేషన్ క్రింద ఎంపిక కావడం శుభపరిణామమని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పి. రాములు అన్నారు. సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీ నుండి వర్చువల్ గా 554 రైల్వే స్టేషన్ ల పునరాభివృద్ధికి మరియు 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జిస్ / అండర్ పాస్ లు పనులు ప్రారంభించగా గద్వాల రైల్వే స్టేషన్ లో నాగర్ కర్నూల్ ఎంపీ రాములు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు, రైల్వే అధికారులు పాల్గొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభ దృశ్యాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ రాములు మాట్లాడుతూ... అమృత్ భారత్ స్టేషన్ క్రింద గద్వాల రైల్వే స్టేషన్ ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. రూ.9.49 కోట్లు గద్వాల రైల్వే స్టేషన్ కు మంజూరు చేయడం పట్ల ప్రధానమంత్రి కి అభినందనలు తెలిపారు. దేశంలోని 554 రైల్వేస్టేషన్ లో ఎంపికైన గద్వాల రైల్వేస్టేషన్ లో అభివృద్ధి పనులు జరుగుతాయని అన్నారు. గద్వాల రైల్వే స్టేషన్ కు 100 ఎకరాల స్థలం ఉన్నదని అ స్థలం వృధా కాకుండ ప్రజోపయోగమైన పనులు చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. గద్వాల రైల్వే స్టేషన్ ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నదని ఇక్కడి ప్రజలు కష్టపడి పని చేస్తారని ఎంపీ రాములు అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రాంత అభివృద్ధికి పని చేస్తున్నారని తాను ఎంపీ అయ్యాక పలు అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేసినట్లు తెలిపారు. శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ... దేశంలోని 554 రైల్వేస్టేషన్లో గద్వాల ఒకటి కావడం , అభివృద్ధి జరగడం సంతోషించదగ్గ విషయం అన్నారు. గద్వాల రైల్వే స్టేషన్లో 20 కొత్త రైళ్లు నడుస్తున్నాయని ప్రతి రైలు ఇక్కడ ఆపే విధంగా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 2013లో రాయిచూర్ లైన్ పూర్తి అయ్యిందని, డోన్ వరకు డబ్లింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎక్కడ లేని విధంగా గద్వాల రైల్వే స్టేషన్ కు మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ 100 ఎకరాల స్థలం ఇచ్చారని అట్టి స్థలంలో కంప చెట్లు తొలగించి సుందర ప్రదేశంగా తీర్చిదిద్దాలని కోరారు. గద్వాల రైల్వే స్టేషన్ అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు దాదాపు రూ.9.49 కోట్ల నిధులు కేటాయించడం పట్ల ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వికసిత భారత్, వికసిత రైల్వే అంశంపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన ఉపన్యాసం, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డివిజనల్ రైల్వే అధికారి అరుణ్ కుమార్ శర్మ మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్లలో ప్రధాన ద్వారంతో పాటు ప్రయాణ ప్రాంగణం, స్టేషన్ లోపల, పరిసరాల్లో పరిశుభ్రత పాటించడం, ప్రయాణికులకు అణువుగా ఉండే సమాచార సూచికలు వృద్ధి చేయడం, వెయిటింగ్ హాల్స్, టాయిలెట్స్, లిఫ్ట్ లు ,ఎస్కలేటర్లు, వన్ స్టేషన్- వన్‌ప్రొడక్ట్ దుకాణాలు, ట్రాఫిక్ వసతులు, మెరుగైన లైటింగ్ , అప్ గ్రేడ్ పార్కింగ్, దివ్యాంగులకు అనుకూలమైన మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్, రైల్వే స్టేషన్ మాస్టర్, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు
# చాటిచెప్పిన నాయకుడు మోదీ
### విజయ సంకల్ప యాత్రలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం) విజయ సంకల్ప యాత్ర లో భాగంగా చిత్తరామ్మ దేవాలయ ప్రాంతంలో వేయిలాది మందితో జన సంద్రంగా మారింది. దేశం కోసం మోడీ, మోడీ గెలుపు కోసమే మనం అంటూ.. మరో సారి మోడీ సర్కార్ అనే నినాదాలతో మూసాపేట్ సర్కిల్ మారుమోగింది. ఈ విజయసంకల్ప యాత్రకు ముఖ్య అతిథులుగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, జాతీయ నాయకులు పి మురళీధర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తెలిపిన నాయకులు మన ప్రధాని మోడీ అని, బీజేపీ అధికారం చెప్పట్టిన కానుండి ప్రజలంతా సుఖ శాంతులతో జీవిస్తున్నారని, గత కాంగ్రెస్ దుర్మార్గ పాలనలో ఉగ్రవాదుల బాంబు దాడులలో అనేక మంది ప్రాణాలు విడిచారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ కాంగ్రెస్ హయాంలో చిన్నపిల్లలు వేసుకునే డైపర్ల నుండి అంతర్జాతీయ కంపెనీలలో తయారయ్యే వస్తువుల వరకు ప్రతి దాంట్లో స్కాములు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిధని దూషించారు. 2జి స్కాం 3జి స్కామ్ ఇలా చెప్పుకుంటూ పోతే అది కాంగ్రెస్ పార్టీ కాదని స్కాం రేస్ పార్టీ అవుతుందని వారు హేళన చేశారు. తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్తు లేని పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని గత టిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ప్రజలను బానిసలుగా చూసిన సంఘటనలను అనేకమని గుర్తు చేశారు, అవినీతి లేని ఎలాంటి మచ్చలేని నిస్వార్థంగా పరిపాలిస్తున్న మన మోడీ రానున్న పార్లమెంట్ ఎన్నికలలో వారికి వెన్నుదండి ఉండి అభ్యర్థి ఎవరైనాప్పటికీ మన మల్కాజ్గిరి నియోజకవర్గంలో బిజెపిని గెలిపించాలని వారు ప్రజలకు విన్నవించారు ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్, మూసాపేట్ డివిజన్ అధ్యక్షులు పిట్టల మనోహర్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, సూర్యారావు, బిజెపి సీనియర్ నాయకులు తుము శైలేష్, బిజెపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


అన్నా సాగర్ లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

## అన్నసాగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి

భూత్పూర్, ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం) దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామంలో సోమవారం విస్తృతంగా పర్యటించి, సిసి రోడ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. అనంతరం సీనియర్ నాయకులు శంషుద్దీన్ ని వారి నివాసంలో కలసి యోగక్షేమాలు ఎమ్మెల్యే జిఎంఆర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమకు గత 10 ఏళ్లుగా పెన్షన్లు రావడంలేదని, ఎలాంటి సంక్షేమ పథకాలు తమకు అందలేదని, మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే తమ సమస్యలు పట్టించుకోలేదని ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. మహిళల సమస్యలు విన్న ఎమ్మెల్యే జిఎంఆర్ తక్షణమే అక్కడ ఉన్న అధికారులతో సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే జియంఆర్ ఆదేశించారు.

## ఫీజుల పేరుతో ఇంటర్ పరీక్షల హాల్ టికెట్లు ఇవ్వకుంటే
# కళాశాలలను ముట్టడిస్తాం
### బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్



కూకట్‌పల్లి, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం) ఫీజుల పేరుతో ఇంటర్ పరీక్షల హాల్ టికెట్లు ఇవ్వకుంటే కాలేజీలను ముట్టడిస్తామని బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ అన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ సందర్భంగా మాట్లాడుతు ఇంటర్మీడియట్ కార్పొరేట్ కళాశాలలు, ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలు విద్యార్థులకు ఫీజులు కట్టలేదని హాల్ టికెట్లు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. ఏ ఒక్క విద్యార్థి హాల్ టికెట్ పేరు మీద పరీక్షలు రాయకుండా నష్టపోకూడదని ఆయన అన్నారు. హాల్ టికెట్లు ఇవ్వకపోతే కళాశాలల ముట్టడికి వెనకాడబోమని విద్యార్థులకు అన్యాయం జరుగుతే సహించేది లేదని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాల యజమాన్యాలకు ఆయన హెచ్చరించారు. అలాగే విద్యార్థులు పరీక్షలను ఆరోగ్యవంతమైన వాతావరణంలో మానసిక ఒత్తిడి లేకుండా వ్రాసే విధంగా కళాశాల యజమాన్యాలు, తల్లిదండ్రులు ప్రయత్నించాలని ఆయన కోరారు.

## గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా
# ముందుకు వెళ్తున్నాం
### ఎమ్మెల్యే జిఎంఆర్

భూత్పూర్, ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం) దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మండలం లోని పోతులమడుగు, గోపన్న పల్లి గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ. జి. మధుసూధన్ రెడ్డి పనులు ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... గ్రామాలలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

### వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అట్టహాసంగా ప్రారంభమైన బోధన సిబ్బంది

# క్రీడలు, సాంస్కృతిక మరియు సాహిత్య పోటీలు



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న బోధన సిబ్బంది



గౌరవ వందనం స్వీకరిస్తున్న అధికారులు

బుద్వేల్, ఫిబ్రవరి26(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల క్రీడా మైదాన ప్రాంగణంలో సోమవారం విశ్వవిద్యాలయ బోధన సిబ్బందికి నిర్వహిస్తున్న క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ డీసీపీ సి.హెచ్. శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటముల కన్నా ఈ పోటీలలో పాల్గొనడం అనేది విజయంతో సమానం అని అన్నారు. అంతేకాకుండా క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని తెలియజేశారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్, పాలకమండలి సభ్యులు, డాక్టర్ సి. నరేందర్ రెడ్డి స్వాగతోపన్యాసం తెలియజేశారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరకంగా చురుకుగా ఉంటారని, మానసికంగా ఉల్లాసంగా ఉండటమే కాకుండా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని తెలియజేశారు. ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్, పాలకమండలి సభ్యులు డాక్టర్ బి. జమునా రాణి మాట్లాడుతూ, క్రీడలు మన జీవితంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని తద్వారా మనము సమయ నిర్వహణ,



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

నాయకత్వ మరియు నిర్ణయాలు తీసుకునే నైపుణ్యతను పెంపొందించుకోవచ్చని తెలియజేశారు. డీన్ ఆఫ్ పి.జి స్టడీస్ డాక్టర్ వి. అనిత మాట్లాడుతూ క్రీడలు మానసిక ఒత్తిడి తగ్గించి ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని తెలియజేశారు. డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ బి. విజయలక్ష్మి మాట్లాడుతూ జట్టుగా ఆటలలో పాల్గొనడం వలన మనోస్థైర్యం పెంపొంది జట్టు విజయవకాశాలు మెరుగుపడతాయని తెలియజేశారు. డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పి. రఘురామిరెడ్డి, మాట్లాడుతూ అందరూ కూడా క్రీడాపూర్తితో పాల్గొని విజయాన్ని సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ వి. సుధారాణి మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యమును, మానసిక ప్రశాంతతను పెంపొందించి పనిచేసే వాతావరణమును ప్రభావితం చేస్తుందని తెలియజేశారు. వర్సిటీ క్రీడా విభాగాధిపతి డాక్టర్ బి. విద్యాసాగర్ క్రీడాకారులందరితో ప్రతిజ్ఞ చేయించారు. విశ్వ విద్యాలయ అధికారులు అందరూ శాంతికపోథాలను ఎగురవేసి ఆటల పోటీలను ప్రారంభించారు. వర్సిటీ పరిశీలకులు డాక్టర్ జె. సురేష్, మాట్లాడుతూ క్రీడలు ఒక మంచి ఔషధం లాంటివి అని చెబుతూ క్రీడాకారులలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించారు. ఈ క్రీడలు సోమవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు కొనసాగనున్నాయని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ , పాలకమండలి సభ్యులు డాక్టర్ సి. నరేందర్ రెడ్డి తెలిపారు. కళాశాల ఆఫీసర్ ఇన్ ఛార్జ్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ వి. రవీందర్ నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొని అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పోటీలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జోన్ల నుండి 110 మంది క్రీడాకారులు వివిధ ఇన్ డోర్, అవుట్ డోర్, సాంస్కృతిక మరియు సాహిత్య పోటీలలో పాల్గొననున్నారు.

## రైల్వే స్టేషన్ల ఆధునీకరణతో


# ప్రయాణికులకు సంపూర్ణ వసతులు

### బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్

శంషాబాద్, ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం) రైల్వే స్టేషన్ లలో కేంద్ర ప్రభుత్వం ఆధునీకరణ పనులు చేపట్టి ప్రయాణికులకు సంపూర్ణ వసతులు కనిపిస్తుందని బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ అన్నారు. సోమవారం దేశ ప్రధాని నరేంద్ర మోడీ అమృత్ రైల్వే స్టేషన్ పథకంలో భాగంగా ఉంధానగర్ రైల్వే స్టేషన్ లో పనులు ప్రారంభించారు. భారత ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల ప్రవేశపెట్టిన అమృత్ భారత్ స్టేషన్ పథకం భారతీయ రైల్వే నెట్వర్క్ అంతటా రైల్వే స్టేషన్లను ఆధునీకరించడం, అత్యధిక మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకం ప్రస్తుతం భారతీయ రైల్వే వ్యవస్థలో మొత్తం 1275 స్టేషన్లను అప్గ్రేడ్ , ఆధునీకరించడానికి ఉద్దేశించబడింది .41 వేల కోట్ల తో 554 స్టేషన్ లలో 1500 ఫ్లైఓవర్ లు , అండర్ పాస్ లకు ఆన్లైన్ ద్వారా శంకుస్థాపన చేశారు. సోన్పూర్ డివిజన్ నుండి 18 స్టేషన్లు , సమస్తిపూర్ డివిజన్ నుండి 20 స్టేషన్లు దృష్టికి ప్రత్యేకించబడ్డాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకం స్టేషన్ల కొనసాగుతున్న అభివృద్ధి కోసం దీర్ఘకాలిక దృష్టిని కలిగి ఉంది. ఇది వివిధ స్టేషన్ సౌకర్యాలను మెరుగుపరచడానికి మాస్టర్ ప్లాన్లను రూపొందించడం, దశలవారీగా అమలు చేయడం. ఈ మెరుగుదలలు మెరుగైన స్టేషన్ యాక్సెసిబిలిటీ , వెయిటింగ్ ఏరియాలు , టాయిలెట్ సదుపాయాలు, లిఫ్ట్ మరియు ఎస్కలేటర్ ఇన్స్టాలేషన్లు, పరిశుభ్రత, ఉచిత వైఫై అందించడం, 'ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి' వంటి కార్యక్రమాల ద్వారా స్థానిక ఉత్పత్తుల కోసం కియోస్క్లను ఏర్పాటు చేయడం , ప్రయాణీకుల సమాచార వ్యవస్థలను మెరుగుపరచడం , ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. ఎగ్జిక్యూటివ్ లాంజ్లు, వ్యాపార సమావేశాల కోసం స్థలాలను కేటాయించడం, ల్యాండ్స్కేపింగ్, ప్రతి స్టేషన్ యొక్క ప్రత్యేక అవసరాలను తీర్చడం ఈ పథకం స్టేషన్ నిర్మాణాలను అప్గ్రేడ్ చేయడం, చుట్టుపక్కల నగర ప్రాంతాలతో స్టేషన్లను రెండు వైపులా అనుసంధానం చేయడం, మల్టీమోడల్ కనెక్టివిటీని ప్రోత్సహించడం, దివ్యాంగుల సౌకర్యాలు కల్పించడం, స్థిరమైన పర్యావరణ అనుకూల పరిష్కారాలను ఏర్పాటు చేయనున్నారు. బ్యాలస్ట్లెస్ ట్రాక్ను ప్రవేశపెట్టడం వంటి వాటిపై దృష్టి పెడుతుంది. అవసరమైనప్పుడు ప్లాజా మెరుగుదలల సాధ్యత , దశలను పరిగణనలోకి తీసుకుంటుంది. దీర్ఘకాలంలో ఈ స్టేషన్లను శక్తివంతమైన సిటీ సెంటర్గా మార్చడమే అంతిమ లక్ష్యం. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే డి ఆర్ ఎం లోకేష్ వైష్ణవ్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, బుక్క వేణుగోపాల్, రాచూరి రాజశేఖర్, కాడెం సుధాకర్,పి మల్లేష్ యాదవ్, నెల్లుట్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.



అమృతోత్సవంలో పాల్గొన్న బిజెపి నాయకులు



సిక్కుల మత గురువు సమాధి వద్ద..

## సిక్కుల మత గురువు
## గురు హర్రాయి మహారాజ్
# 394వ జయంతి వేడుకలు

బుద్వేల్, ఫిబ్రవరి26(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ అత్తాపూర్ సిఖ్ ఛావుని వద్ద ఉన్న గురుద్వారా సాహెబ్ బారంబాల లో ఆదివారం " గురు హర్రాయి జి మహారాజ్ 394 జన్మదిన వేడుకలు " ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎం.పి రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భజనలు, కీర్తనలు నిర్వహించి, ఆపై సాయంత్రం సమయంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ లో ఉన్న వివిధ జిల్లాలు కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సుమారు వేలాది సంఖ్యలో భక్తులు ఈ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. సుమారు 3 కిలోమీటర్ల ఈ ఊరేగింపు, గురుద్వారా నుంచి ప్రారంభమై 9 నెంబర్, హుడా కాలనీ, కిషన్ బాగ్, చుట్టూ తిరుగుతూ మళ్లీ తిరిగి గురుద్వారా కు వచ్చారు. ఈ ఊరేగింపు లో హైదరాబాద్ లోని ఉన్న అన్ని గురుద్వారా సభ్యులు పాల్గొని, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మరియు తమ వద్ద ఉన్న ఆయుధాలతో నృత్యాలు చేశారు. ముఖ్యంగా ఇందులో పంజాబ్ నుంచి అంతర్జాతీయ దలేర్ ఖాల్సా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు. వీరి తో పాటు కార్యక్రమం లో అధ్యక్షుడు సుఖదేవ్ సింగ్ సంతు, సెక్రెటరీ రణ్వీర్ సింగ్, సుర్జిత్ సింగ్, రాహుల్, సంతోష్ సింగ్, సత్నాం సింగ్, గుర్మిత్ సింగ్ పహారియా తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు..



ర్యాలీలో పాల్గొన్న సిక్కు సోదరులు




కిష్టమ్మ గుట్ట లో కూల్చివేతలు చేపడుతున్న రెవెన్యూ అధికారులు

## కిష్టమ్మ గుట్టలో
## అనధికార నిర్మాణాల
# కూల్చివేతలు

బుద్వేల్, ఫిబ్రవరి26(ప్రభాత ఉదయం) : బుద్వేల్ కిష్టమ్మ గుట్ట సర్వేనెంబర్ 424లో నిర్మిస్తున్న నాలుగు ఇండ్లను రాజేంద్రనగర్ తహసిల్దార్ బి రాములు ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సోమవారం నేలమట్టం చేశారు. ప్రభుత్వ స్థలాలలో అనధికార నిర్మాణాలు చేపడుతున్నారంటు ఈ కూల్చివేతలను చేపట్టారు. నిర్మాణాలు చేపడుతున్న వారికి వారి వద్ద ఉన్న పట్టా సర్టిఫికెట్లను చూపెట్టాలని రెండు రోజుల క్రితమే కోరినప్పటికీ వారు చూపెట్టలేదని తహసిల్దార్ రాములు తెలిపారు.

**పట్టా సర్టిఫికెట్ లు ఉన్న వాళ్లే నిర్మాణాలు చేపడుతున్నారు : కోరని ప్రసాద్ : బుద్వేల్ అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షులు :**

బుద్వేల్ దళితులకు ప్రభుత్వం ఇచ్చిన పట్టా సర్టిఫికెట్ల స్థలాల్లోనే నిర్మాణాలు చేపడుతున్నారని అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షులు కోరని ప్రసాద్ తెలిపారు. ఇదే విషయమై అధికారులను కలిసి విన్నవిస్తామన్నారు.



నవీన్ ను సన్మానిస్తున్న పెద్దపులి కిషన్ ( కృష్ణ)

# యువత క్రీడల్లో రాణించాలి

### కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పెద్దపులి కిషన్

గండిపేట, ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం) యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పెద్దపులి కిషన్ (కృష్ణ) అన్నారు. బుధవారం ఇటీవల కరాటే పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన యువతను ఆయన సన్మానించారు. ఇటీవల జరిగిన డబ్ల్యూ కెఎంఏ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 2024 (ప్రపంచ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ డబ్ల్యూ కె ఎం ఏ నిర్వహించింది). అండర్ 20 పోటీలలో గండిపేట మండలం ఖానాపూర్ కు చెందిన నవీన్ కుమార్ కరాటే పై ఉన్న మక్కువతో పోటీపడి వైజాగ్ లో ఫిబ్రవరి 9 నుండి 11 జరిగిన పోటీలలో మొదటి స్థానంలో నిలిచారు. చెన్నైలో ఫిబ్రవరి 18 న జరిగిన రెండు ఈవెంట్లలో కరాటే లో 3వ స్థానం నిలిచిన సందర్భంగా సన్మానించారు. మాస్టర్ కుశాల్ గడ్డం డబ్ల్యూ కె ఎం ఏ నేషనల్ రిఫరీ పొజిషన్ లో అయన ఉన్నారు. ఈ సందర్భంగా పెద్దపులి కిషన్ మాట్లాడుతూ...నవీన్ కుమార్ మరిన్ని క్రీడల పోటీల్లో రాణించి ముందుకు సాగాలన్నారు.

# బోరు మోటారు సీజ్

బుద్వేల్, ఫిబ్రవరి26(ప్రభాత ఉదయం) : టీఎన్జీవోస్ కాలనీ – లక్ష్మీగూడా హౌసింగ్ బోర్డ్ కాలనీల మధ్య గల ప్రభుత్వ స్థలంలో ఆదివారం నాడు బోరు వేస్తున్న బోరు మోటారు ను స్థానికుల ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ తహసిల్దార్ బి రాములు ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. సీజ్ చేసిన లారీని మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ ముందు పెట్టారు. త్వరలోనే ఆ స్థలాన్ని సర్వే చేయిస్తామని తహసిల్దార్ తెలిపారు

రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన బోరు మోటారు







కోకాపేట్ లో జరిగిన మల్లన్న స్వామి ఉత్సవాల్లో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కస్తూరి నరేందర్

## మల్లన్న స్వామి ఆశీస్సులతో
# ప్రజలు సుభిక్షంగా ఉండాలి
## కస్తూరి నరేందర్

### కోకాపేట్ మల్లన్న స్వామి కల్యాణోత్సవం పాల్గొన్న కస్తూరి నరేందర్

గండిపేట, ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం) మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ అన్నారు. సోమవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకపేట లో జరిగిన మల్లన్న స్వామి కళ్యాణోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ కౌన్సిలర్ దుర్గేష్ యాదవ్, కొ ఆప్షన్ సభ్యులు అహ్మద్ షా ఖాన్, ఇతర నాయకులు మల్లేష్, జితేందర్, కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, దుర్గేష్ యాదవ్, వెంకటేశ్ యాదవ్ , నగేశ్, తదితరులు పాల్గొన్నారు.



మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్కు వినతి పత్రం అందజేస్తున్న కాల నీవాసులు

## ఈ నెల 3వ తేదీన మణికొండ మున్సిపాలిటీ నేతాజీ పార్క్ లో ఉచిత వైద్య శిబిరం

### పిఆర్ ఫర్ సహాయోగ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టి అందె లక్ష్మణ్ రావు

గండిపేట, ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం):ఈనెల 3వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పి ఆర్ ఫర్ సహాయోగ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టి అందె లక్ష్మణ్ రావు అన్నారు .సోమవారం మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి నేతాజీ పార్కులో హెల్త్ క్యాంప్ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అందుకు కమిషనర్ ప్రదీప్ కుమార్ సానుకూలంగా స్పందించి వైద్య నిర్వహించుకునేందుకు అనుమతి ఇచ్చారు. వి ఆర్ ఫర్ సహాయోగ్ చారిటబుల్ ట్రస్టీ అందె లక్ష్మణరావు మాట్లాడుతూ... మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీవాసులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఉచిత హెల్త్ క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




## రాంఛీ టెస్టులో
# భారత్ ఘన విజయం
### మరో టెస్ట్ మిగిలి వుండగానే, సిరీస్ టీమిండియా కైవసం

ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో రాంచీలో జరిగిన నాలుగో టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. దీంతో మరో టెస్ట్ మిగిలి వుండానే.. 3-1 తేడాతో సిరీస్ కైవసం చేసుకుంది. 192 పరుగుల లక్ష్యాన్ని భారత్ 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రోహిత్ శర్మ (55) , శుభ్‌మన్ గిల్ (52), ధ్రువ్ జురెల్ (39), యశస్వి (37) రాణించారు. ఐదు టెస్టుల సిరీస్‌లో తొలుత ఫస్ట్ టెస్ట్‌లో ఇంగ్లాండ్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఓటమికి కుంగిపోకుండా టీమిండియా వరుస విజయాలు సాధిస్తోంది. విశాఖపట్నం, రాజ్‌కోట్ తాజాగా రాంచీ టెస్టులో ఇంగ్లీష్ జట్టులో విజయం సాధించింది. విరాట్ కోహ్లీ, మిడిలార్డర్‌లో కేఎల్ రాహుల్ లేకున్నా యువ ఆటగాళ్లు జట్టును విజయపథంలో నడిపిస్తున్నారు. రాంచీ టెస్టులో తొలుత టాస్ ఓడిన టీమిండియా బౌలింగ్ ఎంచుకుంది. తొలిరోజే అరంగేట్ర పేసర్ ఆకాశ్ దీప్ వరుసగా వికెట్లు పడగొట్టడంతో ఫస్ట్ సెషన్‌లోనే భారత్ పైచేయి సాధించింది. అశ్విన్, జడేజా స్పిన్ మాయాజలానికి ఇంగ్లీష్ జట్టు విలవిలలాడిపోయింది. 112 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్‌ను జో రూట్ ఆదుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 353 పరుగులకు ఆలౌట్ అవ్వగా.. భారత్ 307 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అలాగే ఇంగ్లాండ్ సెకండ్ ఇన్నింగ్స్‌లో 145 పరుగులకు చాప చుట్టేసి.. భారత్ ముందు 192 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనిని భారత్ 61 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇకపోతే ఈ మ్యాచ్‌లో యశస్వి జైస్వాల్ అరుదైన ఘనత సాధించాడు. ఇంగ్లాండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ బౌలింగ్‌లో యశస్వి జైస్వాల్ ఒక పరుగు సాధించి ఈ ఘనత సాధించాడు. ఈ టెస్టు సిరీస్‌లో జైస్వాల్ 55 పరుగులు చేసే సమయానికి 600 పరుగుల మార్కును దాటగలిగాడు. తద్వారా ఒక టెస్ట్ సిరీస్‌లో 600ం పరుగులు చేసిన 5వ భారతీయ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. అలాగే, ఈ 22 ఏళ్ల ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ జైస్వాల్ ఇప్పుడు విరాట్ కోహ్లీ, సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్, దిలీప్ సర్దేశాయ్ వంటి దిగ్గజ బ్యాట్స్‌మెన్‌ల సరసన చేరాడు. టీమిండియా మాజీ కెప్టెన్లు విరాట్ కోహ్లీ, సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్ టెస్టు సిరీస్‌లో రెండుసార్లు 600ం పరుగులు చేశారు. సునీల్ గవాస్కర్ మాత్రమే టెస్టు సిరీస్‌లో 700ం పరుగులు చేశాడు. టెస్టు సిరీస్‌లో సన్నీ రెండుసార్లు 700ం పరుగులు చేశాడు. ఇంకో మ్యాచ్ మిగిలివుంది కాబట్టి ఒక టెస్టు సిరీస్ లో అత్యధిక పరుగులు చేసిన రికార్డును కూడా యశస్వి జైస్వాల్ అధిగమించే అవకాశముంది.

## యశస్వి జైస్వాల్
# సరికొత్త చరిత్ర
### 92 ఏళ్లలో ఇదే తొలిసారి

టీమిండియా బ్యాట్స్‌మెన్ యశస్వి జైస్వాల్ పరుగుల వరద పారిస్తూ రికార్డుల మోత మోగిస్తున్నాడు. భారత్-ఇంగ్లాండ్ టెస్టు సిరీస్ లో ఇప్పటికే 600లకు పైగా పరుగులు చేశాడు. దీంతో ఒక టెస్ట్ సిరీస్‌లో 600ం పరుగులు చేసిన భారత మొదటి లెఫ్ట్ హ్యాండ్ బ్యాట్స్‌మెన్‌గా అరుదైన రికార్డు సృష్టించాడు. ఇంగ్లాండ్ తో జరుగుతున్న నాలుగో టెస్టు మ్యాచ్ యశస్వి జైస్వాల్ ఈ అరుదైన ఘనత సాధించాడు. రాంచీ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్ ల టెస్టు సిరీస్ లో భాగంగా ప్రస్తుం రాంచీ వేదికగా 4వ టెస్టు జరుగుతోంది. ఇంగ్లాండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ బౌలింగ్‌లో యశస్వి జైస్వాల్ ఒక పరుగు సాధించి ఈ ఘనత సాధించాడు. ఈ టెస్టు సిరీస్‌లో జైస్వాల్ 55 పరుగులు చేసే సమయానికి 600 పరుగుల మార్కును దాటగలిగాడు. టీమిండియా యువ టాలెంటెడ్ బ్యాట్స్‌మెన్ యశస్వి జైస్వాల్ ఇప్పుడు ఒక టెస్ట్ సిరీస్‌లో 600ం పరుగులు చేసిన 5వ భారతీయ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. అలాగే, ఈ 22 ఏళ్ల ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ జైస్వాల్ ఇప్పుడు విరాట్ కోహ్లీ, సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్, దిలీప్ సర్దేశాయ్ వంటి దిగ్గజ బ్యాట్స్‌మెన్‌ల సరసన చేరాడు. టీమిండియా మాజీ కెప్టెన్లు విరాట్ కోహ్లీ, సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్ టెస్టు సిరీస్‌లో రెండుసార్లు 600ం పరుగులు చేశారు. క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాత్రమే టెస్టు సిరీస్‌లో 700ం పరుగులు చేశాడు. టెస్టు సిరీస్‌లో సన్నీ రెండుసార్లు 700ం పరుగులు చేశాడు. ఇంకో మ్యాచ్ మిగిలివుంది కాబట్టి ఒక టెస్టు సిరీస్ లో అత్యధిక పరుగులు చేసిన రికార్డును కూడా యశస్వి జైస్వాల్ అధిగమించే అవకాశముంది.






## అమ్మ పాట రిలీజ్ చేసిన
# 'విశ్వంభర' డైరెక్టర్ వశిష్ట

విశ్వ కార్తిక్, ఆయూషి పటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన సినిమా 'కలియుగం పట్టణంలో'. చిత్రా శుక్లా కీలక పాత్రలో నటించారు. కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీకి కథ, డైలాగ్స్ ,స్క్రీన్ ప్లే, దర్శకత్వం ఇలా అన్ని బాధ్యతలను రమాకాంత్ రెడ్డి చూసుకున్నారు. మార్చి 22న ఈ మూవీ థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాలోని 'జో జో లాలీ అమ్మ' అంటూ సాగే మదర్ సెంటిమెంట్ పాటని ప్రముఖ దర్శకుడు వశిష్ట రిలీజ్ చేశారు. పాట చాలా బాగుందని చిత్రయూనిట్‌ను అభినందించారు. సినిమా పెద్ద హిట్ అవ్వాలని యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

## తుదిశ్వాస విడిచిన
# ప్రముఖ హాలీవుడ్ యాక్టర్

ప్రముఖ హాలీవుడ్ నటుడు చనిపోయాడు. కెప్టెన్ మార్వెల్, స్టార్ ట్రెక్ సిరీస్‌లో నటించి గుర్తింపు తెచ్చుకున్న కెన్నెత్ మిచెల్(49) ఫిబ్రవరి 24న తుదిశ్వాస విడిచాడు. తాజాగా ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు బయటకు వెల్లడించారు. గత ఐదేళ్లుగా ఏఎల్ఎస్ (అమియోట్రొఫిక్ లాటెరల్ స్క్లెరోసిస్) అనే అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఇతడు.. ఆ వ్యాధితో పోరాడుతూ చనిపోయాడు. 2000 నుంచి సినిమాలు-వెబ్ సిరీసులు చేస్తున్న కెన్నెత్ మిచెల్.. మిరాకిల్, ఛార్మ్స్ ఫర్ ది ఈజీ లైఫ్, బ్లడ్ హనీ, ఘోస్ట్ విస్పరస్ తదితర చిత్రాల్లో నటించాడు. అలానే పలు వెబ్ సిరీసుల్లో హీరోగా, సహాయ పాత్రల్లోనూ నటించి ఆకట్టుకున్నాడు. ఫ్యామిలీ విషయానికొస్తే 2006లో నటి సుసాన్ మే ప్రాట్‌ని పెళ్లి చేసుకున్నాడు. ఇతడికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు.



# పద్మశ్రీ గ్రహీత, ప్రముఖ సింగర్ ఇక లేరు



మ్యూజిక్ లెజెండ్, పద్మశ్రీ గ్రహీత పంకజ్ ఉదాస్ (72) కన్నుమూశారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తను పంకజ్ కూతురు నయాబ్ ఉదాస్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. కాగా పంకజ్.. 1951లో గుజరాత్‌లోని జెటూర్‌లో జన్మించారు. చదువుకునే వయసులోనే ఆయన కుటుంబం ముంబైకి షిఫ్ట్ అయింది. తన అన్నయ్య మన్‌హర్ ఉదాస్ బాలీవుడ్‌లో ప్లేబ్యాక్ సింగర్‌గా రాణించారు. రెండో అన్న నిర్మల్ గజల్ గాయకుడిగా పేరు గడించారు. వారి బాటలోనే పంకజ్ కూడా నడిచారు. 1970లో వచ్చిన తుమ్ హసీన్ మే జవాన్ సినిమాలో తొలిసారి పాట ఆలపించారు. నామ్(1986) సినిమాలో పాడిన చ్ఠిటి ఆయూ హై పాట పంకజ్‌కు గుర్తింపు తెచ్చిపెట్టింది. అప్పటినుంచి మూడు దశాబ్దాల పాటు తన గాత్రంతో ప్రేక్షకులను అలరించారు.'చిట్టి ఆయిహై ఆయూహై.. చిట్టీ ఆయిహై..', 'చాంది జైసా రాంగ్ హై తేరా.. ఔర్ ఆహిస్తా కిజియే బాతే', 'తోడితోడి పియా కరో..' ఇలా బాలీవుడ్‌లో ఎన్నో అద్భుతమైన సాంగ్స్ ఆలపించారు. సొంతంగా మ్యూజిక్ ఆల్బమ్స్ రిలీజ్ చేశారు. గజల్ సింగర్‌గా ఎక్కువ ప్రసిద్ధి పొందారు. పంకజ్ సేవలను గుర్తించిన కేంద్రం 2006లో పద్మశ్రీతో సత్కరించింది.

# త్వరలో 'యోధ' చిత్రం విడుదల
### హైదరాబాద్‌లో సిద్ధార్థ్ మల్హోత్రా, రాశి ఖన్నా సందడి

ధర్మ ప్రొడక్షన్స్ నిర్మాణం లో రూపుదిద్దుకోగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బ్లాక్‌బస్టర్ "యోధ" చిత్ర ప్రమోషన్స్ కోసం ఆ చిత్ర ప్రధాన తారాగణం సిద్ధార్థ్ మల్హోత్రా మరియు రాశి ఖన్నా హైదరాబాద్‌కు చేరుకోవటం తో ఈ చిత్రం పై ఆసక్తి తారా స్థాయికి చేరుకుంది. బంజారాహిల్స్ లోని తాజ్ కృష్ణ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ మాస్టర్ పీస్ మేకింగ్ గురించి ఆకర్షణీయమైన అంశాలను వెల్లడించారు. అభిమానులకు ఉద్దేశించి సిద్ధార్థ్ మల్హోత్రా మాట్లాడుతూ "'యోధ'లో భాగం కావడమే ఒక అసాధారణమైన ప్రయాణం. హైదరాబాద్ ఫిబ్రవరి 26, 2024 - ధర్మ ప్రొడక్షన్స్ నిర్మాణం లో రూపుదిద్దుకోగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బ్లాక్‌బస్టర్ "యోధ" చిత్ర ప్రమోషన్స్ కోసం ఆ చిత్ర ప్రధాన తారాగణం సిద్ధార్థ్ మల్హోత్రా మరియు రాశి ఖన్నా హైదరాబాద్‌కు చేరుకోవటం తో ఈ చిత్రం పై ఆసక్తి తారా స్థాయికి చేరుకుంది. బంజారాహిల్స్ లోని తాజ్ కృష్ణ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ మాస్టర్ పీస్ మేకింగ్ గురించి ఆకర్షణీయమైన అంశాలను వెల్లడించారు. అభిమానులకు ఉద్దేశించి సిద్ధార్థ్ మల్హోత్రా మాట్లాడుతూ "'యోధ'లో భాగం కావడమే ఒక అసాధారణమైన ప్రయాణం. కథనం అత్యంత ఆసక్తిగా ఉ ండటమే కాదు ధైర్యం మరియు దేశభక్తి స్ఫూర్తిదాయకంగానూ ఉ ంటుంది. ప్రేక్షకుల స్పందన కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను " అని అన్నారు. ఈ లో భాగం కావటం పట్ల రాశి ఖన్నా తన సంతోషం వ్యక్తం చేస్తూ, "'యోధ'లో పని చేయడం ఒక ఉ త్తేజకరమైన అనుభవం. అటువంటి ప్రభావవంతమైన కథనంలో భాగమయ్యే అవకాశం కల్పించినందుకు నేను కృతజ్ఞతలు



తెలుపుతున్నాను. కథనం లోనే ధైర్యం మరియు ప్రేమను అందంగా మిలితం చేశారు. ఇది నిజంగా ఆకర్షణీయంగా ఉ ంటుంది. పెద్ద స్క్రీన్‌పై ఈ చిత్రాన్ని చూడటానికి ప్రేక్షకులతో పాటుగా నేను కూడా ఆసక్తిగా చూస్తున్నాను " అని అన్నారు . ఇటీవల, మేకర్స్ ఈ చిత్రం నుండి మొదటి పాట "జిందగీ తేరే నామ్" ను విడుదల చేశారు. ఇది ఇప్పటికే ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. సిద్ధార్థ్ మల్హోత్రా మరియు రాశి ఖన్నాతో కలిసి కీలకమైన పాత్రను పోషించిన బహుముఖ నటి దిశా పటాని "యోధ" కు మరింత ఆకర్షణకు జోడించారు. అన్ని వయసుల ప్రేక్షకులను అలరించే మరపురాని టిక్ అనుభూతిని అందించడానికి వీరంతా సిద్ధంగా ఉన్నారు. ప్రతిభావంతులైన దర్శక ద్వయం సాగర్ ఆంబ్రే మరియు పుష్కర్ ఓజా దర్శకత్వం వహించిన "యోధ" దాని ఆసక్తికరమైన కథాంశంతో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే వాగ్దానం చేస్తుంది. మార్చి 15, 2024న ఈ చిత్రం విడుదల కానుంది.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.